# ఆపరేషన్ సింధూర్‌కు సెల్యూట్

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ రూరల్, మే 8 : ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం వీరోచితమైనదని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వం దేశ ప్రజల శ్రేయస్సు కోసం త్రివిధ దళాలు పాకిస్తాన్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శత్రు సేనలకు చెందిన తొమ్మిది స్థావరాలపై చేసిన దాడులు విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రేరేపిత తీవ్రవాదాన్ని తుద ముట్టించేందుకు త్రివిధ దళాలు చూపిన ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తుందని కొనియాడారు. భారత వైమానిక దళంలో పనిచేసిన అనుభవం తనకూ ఉందని, అందులో యుద్ధ విమానాల పైలట్‌గా ఆయన పనిచేసిన అనుభవాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**మంత్రి ఉత్తమ్‌కు వినతి**

కోదాడ రూరల్ : పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం శివారు ఎన్‌హెచ్ 65పై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, ఇక్కడ అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కోదాడ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వర్‌రావు గురువారం అధ్వర్యంలో వినతి పత్రం అందించారు. మంత్రి స్పందించి ఫోన్‌లో హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# హామీలు అమలు చేయలేని సీఎం రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీశ్


పాలకవీడులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీశ్

పాలకవీడు, మే8 : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైనందున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి అని బీఆర్ఎస్ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేమని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో పురోగతి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని విమర్శించారు. తెలంగాణ సొమ్మునంతా ఢిల్లీకి మోసిన రేంత్‌రెడ్డి, ఇప్పడు రాష్ట్రం వెనుకపడిందని వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, హరి, నాగేశ్వర్‌రావు, శేఖర్, మురళి, నవీన్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి : సీపీఎం



తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నన సీపీఎం నాయకులు

మోతె, మే 8 : అర్హులైన పేదలందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ములుకూరి గోపాల్‌రెడ్డి, కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య, నాగం మల్లయ్య పాల్గొన్నారు.

# గుండెపంగుకు ఉత్తమ సింగర్ అవార్డు



అవార్డును అందుకుంటున్న జి.రమేశ్

కోదాడ రూరల్, మే 8 : పట్టణానికి చెందిన గుండెపంగు రమేశ్‌కు గురువారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ – 2025 అవార్డ్స్‌లో ఉత్తమ సింగర్‌గా అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం, నేత్రదానం, ఎయిడ్స్ వంటి పలు సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పర్చేందుకు తాను పాడిన పాటలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

# మేళ్లచెర్వు శివాలయంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మేళ్లచెరువు, మే 8 : దివీస్ ల్యాబరేటరీస్(చౌటుప్పల్) ఆధ్వర్యంలో మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల తాగునీటి అవసరాల నిమిత్తం రూ.16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, దివీస్ సీఎస్ఆర్ ఇన్‌చార్జి కిశోర్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, రెనోవేషన్ కమిటీ సభ్యులు నరసింహారావు, గోవిందరెడ్డి, శ్రీనివాస్‌రావు, చందర్‌రావు, శంకర్, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణపై అవగాహన

సూర్యాపేట అర్బన్, మే 8 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ ఫైండర్స్ ముప్పారపు నరేందర్, రామ చంద్రయ్య మాట్లాడుతూ ఒక సారి ఉపయోగించే ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణం పరిరక్షించవచ్చని తెలిపారు. మొక్కలను పెంచాలని, వాటితో పర్యావరణం ఎంతో వృద్ధి చెందుతుందని , కవర్లకు బదులుగా చేతి సంచుల వాడకం అలవాటు చేసుకోవాలని సూచించారు. టీవీలు, మొబైల్స్‌కు అతుక్కుపోతున్న తరుణంలో విద్యార్థులను సమ్మర్ క్యాంపులకు పంపడం ద్వారా వారి విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, దాసరి ఎల్లయ్య, సత్యనారాయణ, ఉమ, అనిల్, సాయి, వీరయ్య, పద్మ పాల్గొన్నారు.

## 'దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

నూతనకల్ ; మే 8 : రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి, ఉపాధి హామీ పథకం రక్షణ కోసం ఈ నెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో రూ. 2.50 లక్షల కోట్లు కేటాయించాలని, కూలీలకు కనీస వేతనం రోజుకు రూ. 600 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వేణు, నర్సయ్య, అవిలయ్య, నాగలింగం, రాజయ్య, సూరయ్య, నాగన్న పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ లింగయ్య

తుంగతుర్తి, మే 8 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బోయిన లింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఖో ఖో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్‌లో శిక్షణ ఇస్తారని, ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కొండగడుపుల యాకయ్య, ఉపాధ్యాయులు సహదేవ్, శ్రీనివాస్, లావణ్య పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


మునగాల కొనుగోలు కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మునగాల, మే 8 : ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ సెంటర్లలో కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సిబ్బందికి ఆదేశించారు. మండల పరిధిలోని విజయరాఘవాపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. మండలంలోని బరాఖత్ గూడెం, గణపవరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో వాటిని మూసివేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ధాన్యం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ ఆంజనేయులు, ఏపీఎం నగేశ్, ఆర్ఐ రామారావు, ఏఈఓ భవాని, రైతులు పాల్గొన్నారు.

**భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు**

గరిడేపల్లి : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గురువారం వెలిదండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరకాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించారు. సదస్సులతో భేటీ అయి భూ సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ బండ కవిత, డీఏఓ రాజేందర్‌రెడ్డి, ఏఆర్ఐ రాంబాబు, ప్రవీణ్, జాన్‌ఖాన్ పాల్గొన్నారు.

**టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి**

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం బ్రోస్ ఫౌండేషన్ 4,684 ఆప్టిమాస్ ఫార్మాసిటికల్, సెగ్మెంట్ ఫార్మాసిటికల్, లోక్ భారతి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ 1,429 కిట్లను టీబీ రోగులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పౌష్కాహారం లోపం వల్ల టీబీ వస్తుందని చెప్పారు. టీబీ రోగుల కోరకు ప్రధాన మంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, డాక్టర్లు జయమనోహరి, నాజియా, వెంకట పాపిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : ఏఓ రజని


ఫార్మర్ అవగాహనలో ఏఓ రజని

కోదాడ రూరల్, మే 8 : కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు పొందాలంటే భూమి కలిగిన ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పాలెం రజని అన్నారు. మండలంలోని అల్వాలపురం రైతువేదికలో గురువారం ఆమె ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ రైతుకు ఆధార్ కార్డు తరహాలో 11 అంకెలతో విశిష్ట కార్డు అందిస్తారని, రైతులు వ్యవసాయాధికారులు, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నగేశ్, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులతో బోధన


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

నేరేడుచర్ల, మే 8 : ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన, ఉత్తమ అధ్యాపకులు బోధిస్తారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకరమణ అన్నారు. గరిడేపల్లి మండలం పొనుగోడు, వెంకట్రాంపురంతో పాటు నేరేడుచర్ల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా కళాశాలలో విద్యాబోధన అందిస్తుందన్నారు. కార్పొరేట్ మోజులో పడి ఖర్చు చేసి అప్పులు పాలు కావొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, శ్రీనివాసులు, వెన్నెల సునీత, వీరేషు, వీరు తదితరులు పాల్గొన్నారు.

# 'సమ సమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం'

గరిడేపల్లి, మే 8 : సమ సమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ గరిడేపల్లి గ్రామశాఖ మహాసభను మాజీ ఉపసర్పంచ్ వెన్న వెంకటరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అధికారం, ఓట్లు, సీట్ల కోసం కాకుండా ప్రజల కోసం నిరంతరం పోరాడేది సీపీఐ అన్నారు. అనంతరం సీపీఐ గ్రామ కమిటీ కార్యదర్శిగా యడ్ల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ప్రధాని సైదులుతో పాటు పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, యడ్ల వీరారెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, మాచర్ల బొందయ్య, చిక్కుల్ల శేషయ్య పాల్గొన్నారు.

# స్నేహితుడి కటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

నూతనకల్, మే 8 : మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన పిట్టల సూర్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందా డు. తోటి స్నేహితులు అతని కుటుంబానికి అండగా నిలువాలని నిర్ణయించారు. యువసేన యూత్ ఆధ్వర్యంలో రూ. 10 వేల నగదును గురువారం స్నేహితుడి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో యువసేన యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

**ఏపూరులో**

ఆత్మకూర్.ఎస్ : మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో ఇటీవల మరణించిన రావుల నరేశ్ కుటుంబానికి ఆయన చిన్ననాటి స్నేహితులు హెల్పింగ్ టుగేదర్ ఫౌండేషన్ తరపున, పదో తరగతి 2006–07 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్ బ్యాచ్ తరపున రూ.6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మచ్చ అశోక్‌కమార్, కొనతం అశోక్, మల్లెపాక శ్రీను, నకిరెకంటి చిరంజీవి ఉన్నారు.

# మూణ్నాళ్ల ముచ్చటగా సన్నబియ్యం పంపిణీ

**బీఆర్ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య**


సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మే 8 : రాష్ట్ర ప్రభుత్వం ఆత్రుతంగా గత నెలలో ప్రారంభించిన సన్న బియ్యం పథకం ముణ్నాళ్ల ముచ్చటగా మారిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో మెజార్టీ రేషన్ షాపులకు ఈ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ జరుగలేదన్నారు. గత నెల డీలర్ల వద్ద మిగిలి ఉన్న బియ్యాన్ని మాత్రమే రెండు రోజులు పంపిణీ చేశారని, మే నెలకు సంబంధించిన బియ్యం రాలేదని డీలర్లు లబ్ధిదారులకు చెప్పడంతో వారు నిరాశతో తిరుగు ఇంటి మొఖం పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క పథకం కూడా సమగ్రంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి


జోగు అరవింద్‌రెడ్డి

గరిడేపల్లి, మే 8 : ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పారిశుధ్య కార్మికులను పరిగణలోకి తీసుకొని మొదటి ప్రాధాన్యతలో ఇండ్లు కేటాయించాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు జోగు అరవింద్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగు భూమి లేనివారు, పారిశుధ్య కార్మికులు, అనాథలు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు మొదటి ప్రాధాన్యతలో ఇండ్లు ఇవ్వాలన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నూతనకల్, మే 8 : రైతు బీమా పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నందున అర్హులైన రైతులు ఈ నెల 10 వరకు ఆయా గ్రామాల రైతు వేదిక కార్యాలయాల్లో బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళిబాబు తెలిపారు. గురువారం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం మాట్లాడుతూ రైతు బీమా దరఖాస్తు, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జీరాక్సులను ఇవ్వాలని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్ల వయస్సులోపు రైతులు బీమాకు అర్హులని చెప్పారు. పరిశీలన ప్రక్రియ ఇదివరకు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమేనని తెలిపారు. సమావేశంలో ఏఈఓలు జానయ్య, శ్రావణి, భవ్య తదితరులు ఉన్నారు.

## అదుపు తప్పి దూసుకెళ్లిన కారు.. ఒకరికి గాయాలు

మేళ్లచెర్వు, మే 8 : అదుపు తప్పిన కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఘటన మేళ్లచెర్వు శివారులో గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో స్థానిక రామమందిరం ఈఓగా పని చేస్తున్న నాగెళ్ల శంభిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు భాగం దెబ్బతినగా స్థానికులు దానిని పక్కకు జరిపారు.

## 'పోలీస్ టార్గెట్' వెబ్ సిరీస్ పోస్టర్ ఆవిష్కరణ

కోదాడ రూరల్, మే 8 : పట్టణానికి చెందిన ప్రముఖ షార్ట్ ఫిలిం దర్శక, నిర్మాత తిరుప్ ఏర్పాల నిర్మిస్తున్న పోలీస్ టార్గెట్ వెబ్ సిరీస్ పోస్టర్‌ను మాజీ సర్పంచ్ పార సీతయ్య గురువారం హుజూర్‌నగర్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద చిత్ర బృం దంతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమం లో పంతి తిరపతయ్య, చింతా బాబుమాదిగ, నాగరాజు, నటీనటులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తో మహిళ మృతి

ఆత్మకూర్.ఎస్, మే 8 : మండల పరిధిలోని మిడతన పల్లి గ్రామానికి చెంది న పాశం జానమ్మ (80) రోజూ ఉపాధి పనికి వెళ్లేది. ఏప్రిల్ 30వరకు పనికి వెళ్లగా ఆ తరువాత అస్వస్థతకు గురైంది. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకుంటూ మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలిం చ గా బుధవారం మరణించింది. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## ఆర్థిక సాయం

మఠంపల్లి, మే 8 : మండల కేంద్రం నుంచి గత నెలలో మిర్చి కూలికి కిష్టాపురం వెళ్తుండగా రఘునాథపాలెంలో జరిగిన ఆటో యాక్సిడెంట్‌లో మఠంపల్లికి చెందిన దైదా మానస తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయింది. వారి కుటుంబానికి గణేశ్ ఉత్సవ కమిటీ మహిళా సభ్యులు రూ.12,116, సత్యనారాయణ ఎంటర్‌ప్రైజెస్ తరపున చీదెళ్ల సత్యనారాయణ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల దుర్గమ్మ, వల్లపుదాసు జయమ్మ, నీలం రాములమ్మ, కనకమ్మ, దాసు, రామ నర్సమ్మ, గోవిందమ్మ, రమణ, మంగమ్మ, వరలక్ష్మి, నాగలక్ష్మి, పున్నమ్మ, సావిత్రమ్మ, చంద్రకళ, బాలకృష్ణగౌడ్, సాంబయ్య, గోపి, కిరణ్ యాదవ్ వీరభద్రచారి, మల్లారావు, వీరబాబు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

## కాట్ల సోమయ్య మృతి తీరని లోటు

ఆత్మకూర్.ఎస్, మే 8 : తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు కాట్ల సోమయ్య మరణం బాధకరమని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన దశదినకర్మలో పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి తండ రమేశ్, నాగమల్లయ్య, సోమగాని మల్లయ్య, తండ చంద్రయ్య, యాదగిరి, వెంకన్న, మామిడి లింగయ్య పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా సంబురాలు


100 అడుగుల జాతీయ జెండా వద్ద నినాదాలు చేస్తున్న ఐవీఎఫ్ సభ్యులు

కోదాడ రూరల్/కోదాడ టౌన్, మే 8 : పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను తుద ముట్టించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా గురువారం పట్టణ ఐఓవీ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో 100 అడుగుల జాతీయ జెండా వద్ద మాజీ సైనికులు, ఐవీఓ సభ్యులు భారతమాతకు జై అంటు నినాదాలు చేశారు. కార్యక్రమంలో గుండా మధుసూదన్‌రావు, కె. వెంకన్న, జగిని ప్రసాద్, సామినేని రమేశ్, శ్రీనివాస్‌రావు, జి.నవీన్, బెలిద భరత్, ఎస్‌కె రహీమ్ పాల్గొన్నారు.

**భారత ఆర్మీకి సెల్యూట్**

సూర్యాపేట టౌన్, మే 8 : పహల్గాంలో జరిగిన దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దూళిపాళ దనుంజయనాయుడు సెల్యూట్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొట్టి, జైషే మహ్మద్, హిజ్బుల్, ముజాయిద్దీన్ వంటి శిబిరాలను ధ్వంసం చేయడం, సుమారు 100మంది ఉగ్రవాదులను హతం చేయడం హర్షణీయమన్నారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇనుగుడి వెంకటరమణాచారి, కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు నిగిడాల వీరయ్య, పిల్లుట్ల కనకయ్య, బీసీ విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు కొమర్రాజు వెంకట్, పరికె భరత్ పాల్గొన్నారు.

# పోలీసులు మర్యాదగా నడుచుకోవాలి

- ఎస్పీ నరసింహా



చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడి దరఖాస్తును పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహా

చివ్వెంల, మే 8 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ కె.నర్సింహా అన్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్ ను గురువారం ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులు, ఫిర్యాదులు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి ప్రాథమిక విచారణను వేగవంతం చేయాలన్నారు. బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పకడ్బందీగా చేయాలని, జాతీయ రహదారి వెంట నిఘా ఉంచాలని చెప్పారు. ఎస్ఐలు మహేశ్వర్, కనకరత్నం, ఏఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

# పేదింటి బిడ్డలకు కల్యాణ లక్ష్మి వరం : ఎమ్మెల్యే సామేల్


కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి, మే 8 : పేద ప్రజలకు కల్యాణ లక్ష్మి పథకం వరం లాంటిదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం తాసీల్దార్ కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తాసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషుకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దాసరి శ్రీను, ఉప్పుల రాంబాబు, కొండరాజు వీరబోయిన గంగరాజు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకు పరామర్శ


శ్రీకాంత్‌కు నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

గరిడేపల్లి, మే 8 : గరిడేపల్లి మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని కొత్తగూడెం గ్రామ మాజీ సర్పంచ్ నకిరేకంటి ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గానుగబండ గ్రామంలో బీఆర్ఎస్‌పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు ఈద ఆంజనేయులు కుమారుడు శ్రీకాంత్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మండల మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు మాశెట్టి శ్రీహరి, మాజీ ఎంపీటీసీ స్వప్న పాల్గొన్నారు.

**వధూవరులకు ఆశీర్వచనం**

పెన్‌పహాడ్ : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి గురువారం నవ వధువును ఆశీర్వదించారు. మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లక మధుసూదన్ భిక్షమమ్మల కుమార్తె రేణుక వివాహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. అదే గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి తల్లి కొండేటి లక్ష్మమ్మను మర్యాదపూర్వకంగా కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగందర్, గ్రామశాఖ అధ్యక్షుడు యల్లంల జగన్, మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దొంగరి సుధాకర్ పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ


మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి, మే 8 : గరిడేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పొనుగోడు, కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. శుక్రవారం సమ్మర్ క్యాంపులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 6నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లో భాగంగా డ్రాయింగ్, స్పోర్ట్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, యోగాలపై ప్రత్యేక శిక్షణ 15రోజుల పాటు ఇస్తారని, విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ ఇన్‌స్ట్రక్టర్స్ కె.ధనమ్మ, అంబేద్కర్, ఎ.బాలు, సీఆర్పీలు రాతికింది రామకృష్ణ, ఎ.అశోక్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, రాములు, ఉమ పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నేరేడుచర్ల, మే 8 : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన మామిడి మంగమ్మ, రెడ్డపాంగు మరియమ్మకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తాసీల్దార్ సురిగి సైదులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, నాయకులు కట్టా రామారావు, కట్టా కృష్ణయ్య, తోట శ్రీనివాస్‌రావు, మామిడి వెంకన్న, ముక్కంటి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో మోస్తరు వర్షం


సూర్యాపేటలో కురుస్తున్న వర్షం

సూర్యాపేట టౌన్, మే 8 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం అరగంటపాటు కురిసిన మోస్తరం వర్షంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. ప్రజలు వర్షంలో రోడ్లపైకి వచ్చి ఆస్వాదించారు.